నిధుల్లేకుండా పండుగల నిర్వహణ ఎలా?

- ప్రజాప్రతినిధులు లేకపోవడంతో పంచాయతీ కార్యదర్శులపై నిర్వహణ భారం
- ప్రభుత్వం నుంచి విడుదల కాని నిధులు
- గ్రామాల్లో సమస్యల తిష్ట

8

సంగారెడ్డి ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలలో ఆడిటోరియం నిర్మాణానికి

రూ. 75 లక్షలు మంజూరు చేయించిన జగ్గారెడ్డి, నిర్మల

- తక్షణమే టెండర్లు పిలిచి పనులు చేపట్టాలని సూచించిన జగ్గారెడ్డి
- టీజీఐఐసీ నుంచి నిధులు మంజూరు చేయించామని వెల్లడి
- రెండు వేల మంది చదువుకునేలా అన్ని హంగులతో కళాశాల, హాస్టల్ భవనం నిర్మిస్తామని హామీ
- అక్టోబర్ 10 లోపు ప్రతిపాదనలు, నమూనాలను సిద్ధం చేయాలని సూచన
- సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు దామోదర్ రాజనర్సింహ, శ్రీధర్ బాబు, వివేక్‌తో మాట్లాడి నిధులు మంజూరు చేయిస్తానన్న జగ్గారెడ్డి
- తన కూతురు ఎంతో మీరు కూడా అంతేనని స్పష్టం చేసిన జగ్గారెడ్డి
- మీ మానవత్వం చూసి అభిమానులమయ్యామని విద్యార్థినులు తెలుపడంతో సంతోషించిన జగ్గారెడ్డి

సంగారెడ్డి టౌన్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డిలోని ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలను టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలారెడ్డితో కలిసి టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సందర్శించారు. వీరికి కళాశాల విద్యార్థినులు చప్పట్లతో స్వాగతం పలికారు. కళాశాలలో నెలకొన్న సమస్యలను అడిగి వారు తెలుసుకున్నారు. ఈసందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ కళాశాల అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులను కలిసి నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థినులతో జగ్గారెడ్డి చిట్ చాట్ చేస్తూ తన చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.



సంగారెడ్డి మహిళా జూనియర్ కళాశాలలో మాట్లాడుతున్న జగ్గారెడ్డి



జగ్గారెడ్డికి జై కొడుతున్న సంగారెడ్డి మహిళా జూనియర్ కళాశాల విద్యార్థినులు

తలో చేయి వేశారు.. రోడ్డు బాగు చేసుకున్నారు

8

భక్తిశ్రద్ధలతో మహాలయ అమావాస్య





చింతమడకలో మహిళలతో కలిసి బతుకమ్మ ఆడుతున్న తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత, కొమురవెల్లి మల్లన్న ఆలయం వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు

ఉయ్యాలో ఉయ్యాలో

- బతుకమ్మ సంబురాలు ప్రారంభం
- ఊరూవాడ పూల జాతర
- ఉత్సాహంగా పాల్గొన్న మహిళలు

హుస్నాబాద్/సిద్దిపేట రూరల్/మిరుదొడ్డి, సెప్టెంబరు 21 : బతుకమ్మ మహోత్సవం ప్రారంభమైంది. జిల్లాలోని ఊరువాడ చిన్నబతుకమ్మ వేడుకలతో సందడిగా మారింది. తొలి రోజైన ఆదివారం ఎంగిలిపూల బతుకమ్మను పేర్చారు. తంగేడు, గునుగు, పట్టుకుచ్చు, చామంతి, బంతి పూలతో పేర్చిన బతుకమ్మను వీధుల్లోని కూడళ్లల్లో పెట్టారు. ఆడపడుచులు, యువతులు, చిన్నారులు చప్పట్లు చరుస్తూ అందరూ లయబద్ధంగా ఉయ్యాల పాటలు పాడుతూ బతుకమ్మ చుట్టూ ఉత్సాహంగా తిరిగారు. పలు చోట్ల సౌండ్‌బాక్స్‌ల్లో బతుకమ్మ పాటలు హోరెత్తాయి. అనంతరం సమీపంలోని చెరువులు, బతుకమ్మఘాట్‌లలో నిమజ్జనం చేశారు. పసుపు, కుంకుమ్మ వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు.

హుస్నాబాద్‌లో మంత్రి సందడి

హుస్నాబాద్ పట్టణంలోని చావిడి, ఆరెపల్లి, హనుమాన్‌నగర్, ఎల్లమ్మ వద్ద చిన్నబతుకమ్మ సంబరాలు వైభవంగా జరిగాయి. మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరై మహిళలతో బతుకమ్మ ఆటాడి వారిలో ఉత్సాహన్ని నింపారు. ఆడపడుచులకు మంత్రి బతుకమ్మ శుభాకాంక్షలను తెలిపారు. సంబరాలలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మాజీ చైర్‌పర్సన్ ఆకుల రజిత తదితరులు పాల్గొన్నారు.

చింతమడకలో కవిత

సిద్దిపేట రూరల్ మండలం మాజీ సీఎం కేసీఆర్ స్వగ్రామం చింతమడకలో తెలంగాణ జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. ముందుగా కవిత గ్రామ శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాదిగ సంఘం గ్రామ అధ్యక్షుడు జింక స్వామి, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు చిన్నరాం ముత్యం నివాసాల్లో మహిళలతో కలిసి ఆమె బతుకమ్మను పేర్చారు. కేసీఆర్ సెంటిమెంట్ రామాలయంలో బతుకమ్మతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఎంగిలి పూల బతుకమ్మ ఆడారు. గ్రామ మహిళలు, చిన్నారులతో మమేకమవుతూ బతుకమ్మ చుట్టూ తిరిగారు. అనంతరం కవిత మాట్లాడుతూ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు.



విమలక్క బహుజన బతుకమ్మ

మిరుదొడ్డి మండలం మల్లుపల్లి గ్రామంలో బహుజన బతుకమ్మ సంబురాలను నిర్వహించారు. ప్రజాకవి, బహుజన బతుకమ్మ వ్యవస్థాపక అధ్యక్షురాలు విమలక్క పాల్గొని గ్రామస్థులతో కలిసి బతుకమ్మ ఆడారు. పాటలు పాడుతూ మహిళలల్లో చైతన్యం కలిగించే బతుకమ్మ పాటలు పాడారు. అనంతరం అందరితో కలిసి చెరువులో బతుకమ్మ నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు శంకర్, గొపరియాదగిరి, శ్రీనివాస్, మహేందర్, అందె భాస్కర్, ముత్యాల నర్సింహులు, బిక్షపతి, లక్ష్మణ్, పరశురాములు, భాను, పృథ్వీ పాల్గొన్నారు.







హుస్నాబాద్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు, వేడుకల్లో మంత్రి పొన్నం ప్రభాకర్ చిన్నకోడూరులో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

అమ్మ వస్తోంది



దేవీ నమో... శైలపుత్రీ నమో

- నేటి నుంచి శరన్నవరాత్రోత్సవాలు
- ముస్తాబైన మండపాలు, ఆలయాలు
- మర్పడగ, విద్యాధరి క్షేత్రాల్లో ఏర్పాట్లు పూర్తి

సిద్దిపేట జిలాల్లో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆయా చోట్ల భారీ ఎత్తున సెట్టింగులతో మండపాలను ఏర్పాటు చేశారు. తోరణాలు, జెండాలు, వీధి విద్యుత్ కాంతులతో శోభాయమానంగా అలంకరించారు. జిల్లాలోని ప్రముఖ క్షేత్రాలైన మర్పడగ విజయదుర్గామాత, విద్యాధరి సరస్వతీమాత ఆలయాల్లో ఉత్సవాలకు ఆలయ కమిటీ వైభవంగా నిర్వహించనున్నది.

7



విద్యుత్‌దీపాలు, స్వాగత తోరణాలతో వర్గల్ విద్యాధరి క్షేత్రం

రిజర్వేషన్ల హడావిడి

- ఆదివారమూ అధికారుల కసరత్తు
- సెలవు రోజూ జిల్లా అధికారులతో వీడియోకాన్ఫరెన్స్
- బీసీ, ఎస్సీ, ఎస్టీ జనాభా, ఓట్ల వివరాల సేకరణ
- వార్డులు, గ్రామాలు, మండలాల వారీగా దృష్టి
- రెండ్రోజుల్లో నివేదికలు సిద్ధం చేయాలంటూ ఆదేశం
- ఏ క్షణమైనా రిజర్వేషన్ల ప్రకటన.. నోటిఫికేషన్ విడుదల

స్థానిక, గ్రామపంచాయతీ ఎన్నికల రిజర్వేషన్ల దిశగా సర్కారు అడుగులేస్తోంది. వార్డులు, గ్రామాలు, మండలాల వారీగా బీసీ, ఎస్సీ, ఎస్టీ జనాభా, మహిళలు, పురుషుల జనాభాకు సంబంధించిన వివరాలపై కసరత్తు మొదలైంది. రెండ్రోజుల్లో నివేదిక సమర్పించాలని శనివారం రాత్రి కలెక్టర్లకు ఆదేశాలు వచ్చాయి. ఆదివారం సెలవు దినమైనప్పటికీ వీడియో కాన్ఫరెన్సు నిర్వహించి సూచనలు చేశారు. ఇదే క్రమంలో సంగారెడ్డి, సిద్దిపేట, మెదక్ జిల్లాల్లోని కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, డీపీవోలు, జడ్పీ సీఈవోలు హాజరై ఎంపీడీవోలకు ఉత్తర్వులు జారీ చేశారు.



ఉమ్మడి జిల్లాలో వివరాలు

జిల్లా	వార్డులు	పంచాయతీలు	ఎంపీటీసీలు	జడ్పీటీసీలు
సంగారెడ్డి	5,370	613	261	25
సిద్దిపేట	4,508	508	230	26
మెదక్	4,220	492	190	21

సిద్దిపేట, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఇప్పటికే స్థానిక, గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించిన తుది ఓటరు జాబితాలను ప్రకటించారు. ఇక రిజర్వేషన్లు ప్రకటించడమే తరువాయి అన్నట్లుగా ఉంది. ఆ తర్వాత నోటిఫికేషన్ విడుదల చేస్తారు. ఈ క్రమంలో రిజర్వేషన్ల ప్రక్రియపై కీలక అడుగు పడింది. జనాభా ఆధారంగానే రిజర్వేషన్లు ఖరారు చేస్తున్న దృష్ట్యా పల్లెల్లో ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాల లెక్కలను అంచనా వేయడంలో అధికార యంత్రాంగం నిమగ్నమైంది.



పల్లె జనాభాపై ఫోకస్

2011 జనాభా లెక్కల ప్రకారం ఎస్సీ, ఎస్టీ జనాభాతోపాటు కమిషన్ రిపోర్టు ఆధారంగా ఉన్న బీసీ జనాభాను పరిగణనలోకి తీసుకోవడంపై సర్కారు దృష్టి పెట్టింది. వార్డులు, గ్రామాలు, ఎంపీటీసీ పరిధి, మండల పరిధిలో ఉన్న జనాభా ప్రాతిపదికనే రిజర్వేషన్లు ఖరారు చేయనున్నారు. గత

మిగతా 7లో

చేర్యాల పట్టణ ప్రజలను వరద ముప్పు తీవ్రంగా వేధిస్తోంది. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా గాంధీచౌక్, కడవేరుగు దారి, ఆర్టీసీ బస్టాండ్ వంటి ప్రాంతాలు ఇప్పటికే జలమయమై ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగించాయి. ఈ సమస్య ఇంకా సద్దుమణగక ముందే, ఇప్పుడు పెద్దచెరువు మత్తడి పారడంతో శుభోదయనగర్, యాదవనగర్ కాలనీల ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

- పెద్దచెరువు మత్తడితో కాలనీలకు ఇక్కట్లు
- శుభోదయనగర్, యాదవనగర్ కాలనీల ప్రజల భయాందోళన
- అసంపూర్తిగా నిలిచిపోయిన కాలువ నిర్మాణం
- పాఠశాలల గుండా ప్రవహిస్తున్న వరదనీరు
- అధికారుల నిర్లక్ష్యంపై ప్రజల ఆగ్రహం

చేర్యాలకు వరద ముప్పు

చేర్యాల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పెద్దచెరువు నిండి అలుగు పారుతుండటం చేర్యాల పట్టణ ప్రజలకు సంతోషాన్ని కలిగించినప్పటికీ, శుభోదయనగర్, యాదవనగర్ కాలనీవాసులకు మాత్రం ఇది శాపంగా మారింది. గతంలో చెరువు మత్తడి నీటిని మళ్లించడానికి చేపట్టిన కాలువ నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోవడంతో, వరదనీరు ఇప్పుడు వ్యవసాయ భూముల గుండా, నివాసాల మధ్య ప్రవహిస్తోంది. దీనివల్ల కాలనీ ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. గతంలో ఇదే సమస్య కారణంగా ప్రధాన రహదారిపై మోకాళ్ల లోతు నీరు నిలిచి, లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లకు వరద చేరింది.

అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం

నాలుగేళ్ల తర్వాత పెద్దచెరువు మత్తడి పారడంతో, అసంపూర్తిగా ఉన్న కాలువ ద్వారా నీరు జనావాసాల్లోకి చేరుతోంది. నీటిపారుదల, మున్సిపల్ అధికారులు ఈ సమస్యను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టడంలో జాప్యం వల్ల భవిష్యత్తులో భారీ వర్షాలు కురిస్తే పరిస్థితి మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పాఠశాలలకు ప్రమాదం

శుభోదయనగర్ కాలనీలో శ్రీచైతన్య, వికాస్, పంచతంత్ర వంటి పాఠశాలలు ఉన్నాయి. వరదనీరు ఈ పాఠశాలల ప్రాంగణాల గుండా ప్రవహిస్తుండటంతో విద్యార్థులు నీటిలో నడుచుకుంటూ వెళ్లాల్సి వస్తోంది. ఇది విద్యార్థుల భద్రతకు ముప్పుగా మారిందని, తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని కథనం పేర్కొంది.



పెద్దచెరువుకు కిలోమీటరు దూరంలోని శుభోదయనగర్ కాలనీలో మత్తడి నీరు

వరద ముప్పు నివారణకు నీటిపారుదల, మున్సిపల్, రెవెన్యూ శాఖల అధికారులు సమన్వయంతో తక్షణ చర్యలు చేపట్టాలని చేర్యాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పట్టణం వరద ముంపునకు గురికావడానికి అధికారుల నిర్లక్ష్యమే కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు.

దుబ్బాకలో దొంగనోట్ల కలకలం


ఒకే సీరీస్‌తో రూ.200 నోట్లు

దుబ్బాక, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): దుబ్బాకలో దొంగ నోట్ల చలామణి శనివారం రాత్రి కలకలం సృష్టించింది. శనివారం దుబ్బాకలో అంగడిని లక్ష్యంగా చేసుకుని దుండగులు దొంగ నోట్లను చలామణి చేశారు. బీబీడీ 477982 సీరీస్‌తో ఉన్న రూ.200 నోట్లను కూరగాయల వ్యాపారులకు ఇస్తూ బదులుగా రూ.500 నోట్లు తీసుకున్నారు. పక్కపక్కనే కూర్చున్న కూరగాయల వ్యాపారులు నోట్లను పరిశీలించి, చూసేసరికి ఒకే నంబరుతో నోట్లు కలిగి ఉండటంతో వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు దుబ్బాక ఎస్‌ఐ కీర్తిరాజు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

వినాయక కళాశాలలో స్నాతకోత్సవం

కొండపాక, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కొండపాక మండలం తిమ్మారెడ్డిపల్లి శివారులోని వినాయక కాలేజ్ ఆఫ్ ఐటీ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాలలో ఆదివారం స్నాతకోత్సవం నిర్వహించారు ఈ సందర్భంగా గ్రాడ్యుయేషన్ డే జరిపారు. ఈ సందర్భగా కళాశాల చైర్మన్ రాజు, ప్రిన్సిపల్ రేఖారాణి మాట్లాడారు. చదువుతోపాటు నేటి కాలానికి తగిన విధంగా నైపుణ్యాలు నేర్చుకోవాలని పోటీ ప్రపంచంలో తనదైన శైలిని కనబర్చాలని సూచించారు. ప్రిన్సిపల్ రేఖారాణి ముందుగా గ్రాడ్యుయేషన్స్ సందర్భంగా విద్యార్థులను అభినందించారు. ఉపాధ్యాయులు మాట్లాడిన అనంతరం చైర్మన్ రాజు విద్యార్థులకు సర్టిఫికెట్స్, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు స్వాతి, లింగం, సతీష్, శేఖర్ పరంధాములు తదితరులు పాల్గొన్నారు.


గ్రాడ్యుయేషన్ డే లో పాల్గొన్న విద్యార్థులు

బువ్వ కోసం అవ్వ ఆరాటం

● 80 ఏళ్ల వయసులో కడుపు నింపుకోవడానికి సీతాఫలాలు అమ్ముతున్న వృద్ధురాలు


జోగిపేటలో సీతాఫలాలు అమ్ముతున్న తంగ్లీ బాయి

జోగిపేట, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సాధారణంగా 60 ఏళ్ల దాటిన వారికి వృత్తి, వ్యాపారాల నుంచి విశ్రాంతి ఇచ్చి, వారిని గౌరవంగా చూసుకోవడం మన సమాజంలో కనిపిస్తుంది. ఆ వయసులో ఇంట్లో మనవలు, మనవరాళ్లతో సంతోషంగా గడపడం సర్వసాధారణం. కానీ ఇది కేవలం ఆర్థికంగా బలంగా ఉన్న మధ్య తరగతి, ఎగువ మధ్య తరగతి, ధనిక వర్గాలకే పరిమితం. పేద, బలహీన వర్గాల్లోని వృద్ధులకు మాత్రం వృద్ధాప్యంలోనూ కడుపు నింపుకోవడానికి పోరాటం తప్పడం లేదు. అలాంటి హృదయ విదారక దృశ్యమే జోగిపేటలో కనిపించింది. అల్లాదుర్గం తండాకు చెందిన 80 ఏళ్ల వృద్ధురాలు తంగ్లీ బాయి నెత్తిన సీతాఫలాల బుట్ట మోస్తూ పట్టణ వీధుల్లో తిరుగుతూ కనిపించింది. శరీరం సహకరించకపోయినా, ఆకలిని తీర్చుకోవడానికి ఆమె పడుతున్న ఈ ఆరాటం చూసిన ప్రతి ఒక్కరి మనసును కదిలించింది.

జూదం ఆడుతున్న పలువురి అరెస్టు

నారాయణఖేడ్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తుర్కపల్లి శివారులోని శ్మశాన వాటిక, గంగాపూర్‌లో జూదం ఆడుతున్నట్లు పలువురిని పోలీసులు అరెస్టు చేశారు. ఎస్‌ఐ విద్యాచరణ్ రెడ్డి కథనం ప్రకారం తుర్కపల్లి శివారులోని శ్మశానవాటికలో జూదం ఆడుతుండగా పోలీసులు దాడి చేసి నలుగురిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.9,470 స్వాధీనం చేసుకున్నారు. అలాగే గంగాపూర్‌లోని మల్లారెడ్డి వ్యవసాయ పొలంలో జూదం ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.3,960 స్వాధీనం చేసుకున్నామన్నారు.

కుక్కల దాడిలో 11 గొర్రెలు మృతి

తూప్రాన్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తూప్రాన్ పట్టణ పరిధిలో ఊర కుక్కలు దాడి చేయగా 11 గొర్రెలు మృతి చెందాయి. మరో గొర్రె తీవ్రంగా గాయపడింది. తూప్రాన్ పట్టణ పరిధి తాతపాపన్‌పల్లికి చెందిన బండ్ల గణేశ్ గొర్రెల పెంపకంతో జీవనోపాధి పొందుతున్నాడు. శనివారం గొర్రెలు తోలుకొచ్చి రాత్రి షెడ్డులో ఉంచాడు. ఆదివారం తెల్లవారుజామున ఊర కుక్కలు షెడ్డులోకి చొరబడి గొర్రెలపై దాడి చేశాయి.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

ములుగు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని వంటిమామిడిలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... వెస్ట్ బెంగాల్ రాష్ట్రానికి చెందిన సుశాంత్ పరమానిక్ ఆదివారం ఉదయం 11 గంటలకు వంటిమామిడి వద్ద చికెన్ కొనుగోలు చేసి, లక్ష్మక్కపల్లి వైపు నడుచుకుంటూ వెళ్తున్నారు. అదే సమయంలో డ్రైవర్ పిట్ల నర్సింహులు లారీ నడపుకుంటూ వచ్చి అతడిని ఢీకొట్టడంతో సుశాంత్ పరమానిక్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలు..


లక్ష్మి(ఫైల్)

మద్దూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కోమాలోకి వెళ్లిన వృద్ధురాలు చికిత్స పొందుతూ మృతిచెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని లద్నూరు గ్రామానికి చెందిన చల్ల లక్ష్మి (75) ఆస్తమాతో పాటు మధుమేహంతో బాధపడుతోంది. ఈ క్రమంలో ఈ నెల 16న ఉపశమనం కోసం మాత్రలు అధిక మోతాదులో తీసుకోవడంతో కోమాలోకి వెళ్లింది. వెంటనే చికిత్స కోసం కుటుంబ సభ్యులు జనగామ జిల్లా కేంద్రంలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు మెరుగైన చికిత్స కోసం వరంగల్ ఎంజీఎం రెఫర్ చేయడంతో తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ నిన్న రాత్రి మృతి చెందింది. మృతురాలికి భర్త, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

టిప్పర్ బోల్తా.. ట్రాఫిక్‌కు అంతరాయం



పుల్కల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): చౌటకూర్ మండలం సుల్తానాపూర్ వద్ద సంగారెడ్డి-నాందేడ్, అకోలా 161 జాతీయ రహదారిపై ఆదివారం టిప్పర్ బోల్తా పడింది. కంకర డస్ట్ లోడుతో జోగిపేట వైపునకు వెళ్తున్న టిప్పర్ సుల్తానాపూర్ వద్దకు రాగానే అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. టిప్పర్ జాతీయ రహదారిపై అడ్డంగా బోల్తా పడటంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దాదాపు గంటపాటు జోగిపేట వైపునకు వెళ్లే వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ఈ విషయమై ఎన్‌హెచ్‌ఏఐ టోల్‌ప్లాజాకు సమాచారం అందించడంతో హుటాహుటిన పెట్రోలింగ్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకున్నారు. క్రేన్‌ను రప్పించి రోడ్డుపై అడ్డంగా పడిపోయిన టిప్పర్ వాహనాన్ని పక్కకు తొలగించారు. అయితే, టిప్పర్‌లో తరలిస్తున్న కంకర డస్ట్ మొత్తం జాతీయ రహదారిపై పడటంతో వాహనాలు వెళ్లలేని దుస్థితి నెలకొంది. దీంతో గ్రామ మాజీ ఉప సర్పంచ్ గుండన్నగారి శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని ట్రాక్టర్ డోజర్‌ను తెప్పించి రోడ్డుపై పడిన కంకర డస్ట్‌ను తొలగింపజేశారు.

భార్యతో గొడవ పడి.. చెరువులో దూకిన వ్యక్తి గల్లంతు

అమీన్‌పూర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): భార్యతో గొడవల కారణంగా విసిగిపోయి ఓ వ్యక్తి చెరువులో దూకిన సంఘటన ఆదివారం ఉదయం అమీన్‌పూర్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మియాపూర్ పరిధిలోని హఫీజ్‌పేట్ ఆదిత్యనగర్ కాలనీలో నివాసం ఉండే బఖ్రతుల్లా ఖాన్ (28)కు తన భార్యతో కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. గతంలో భార్యపై అనుమానంతో పలు మార్లు దాడి చేయడంతో మాదాపూర్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. భార్యను మానసికంగా, శారీరకంగా వేధించిన కేసులో మూడు నెలలు జైలుకు వెళ్లి ఇటీవలే వచ్చాడు. స్ట్రక్చరల్ డిజైనర్‌గా పనిచేసే బఖ్రతుల్లా ఖాన్ కోల్‌కతాకు చెందిన పర్వీన్ బేగంను ప్రేమ వివాహం చేసుకున్నాడు. కొంతకాలానికే వారి కాపురంలో కలహాలు తలెత్తాయి. ఒకరిపై ఒకరు కేసులు పెట్టుకుని పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. భార్య కేసు పెట్టడం వల్లే జైలు పాలయ్యానని మానసిక వ్యధలో బఖ్రతుల్లా ఖాన్ కుంగిపోయాడు. తాను ఆత్మహత్య చేసుకుంటానని, భార్య వల్ల తలెత్తిన వివాదాలే కారణమని పేర్కొంటూ రాసిన ఉత్తరం, సెల్‌ఫోన్, చెప్పులను అమీన్‌పూర్ పెద్ద చెరువు గట్టుపై పెట్టి ఆదివారం ఉదయం మాయమయ్యాడు. చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు భావిస్తున్నారు. తన భర్త కనిపించడం లేదని భార్య పర్వీన్ బేగం మియాపూర్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదైంది. చెరువు గట్టుపై ఉన్న వస్తువులు చూసి కొందరు స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. గట్టుపై బఖ్రతుల్లా ఖాన్ సెల్‌ఫోన్, లెటర్, చెప్పులు గుర్తించారు. చెరువులో నీరు ఎక్కువగా ఉండటంతో ఆచూకీ కోసం ఎన్‌డీఆర్ఎఫ్, ఫైర్ సిబ్బందిని పిలిపించారు. రాత్రి వరకు గాలింపు చేపట్టినా ఫలితం కనిపించలేదు. మృతదేహం లభ్యమైన తరువాతే ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తిస్తామని, అంతవరకు గాలింపు కొనసాగుతుందని అమీన్‌పూర్ ఇన్‌స్పెక్టర్ నరేష్ తెలిపారు.

వాగు దాటుతుండగా కొట్టుకుపోయిన వ్యక్తి..

రాయికోడ్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): వాగు దాటుతుండగా వరదాటికి ఓ వ్యక్తి కొట్టుకుపోయి గల్లంతయ్యాడు. గ్రామస్థులు, పోలీసుల కథనం ప్రకారం.. రాయికోడ్ మండల పరిధిలోని కుసునూర్ గ్రామానికి చెందిన కృష్ణ(42) ఆదివారం ఆ గ్రామ శివారులోని చాకిరి వాగు దాటుతుండగా.. ప్రమాదవశాత్తు కాలుజారి నీటిలో కొట్టుకుపోయాడు. అతడిని గ్రామస్థులు కాపాడే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. గ్రామస్థులు, పోలీసులు కృష్ణ ఆచూకీ కోసం గాలిస్తున్నారు.

భార్య డబ్బులు ఇవ్వలేదని భర్త అదృశ్యం


అశోక్(ఫైల్)

రామచంద్రాపురం టౌన్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తాగడానికి భార్య డబ్బులు ఇవ్వలేదని భర్త అదృశ్యమైన సంఘటన రామచంద్రాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ వెంకటయ్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రామచంద్రాపురం ఎస్ఎన్‌కాలనీలో నివాసం ఉంటున్న అశోక్‌కు కూలీగా పనిచేస్తున్నారు. మద్యం అలవాటు ఉంది. ఈ నెల 15వ తేదీన తాగడానికి డబ్బులు కావాలంటూ భార్య శిరీషను అడిగారు. ఆమె తిరస్కరించడంతో ఇంటినుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో భార్య శిరీష ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

రెడ్డిపల్లి పీహెచ్‌సీలో చోరీ

నర్సాపూర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ మండలం రెడ్డిపల్లిలోని పీహెచ్‌సీలో చోరీ జరిగింది. ఎస్‌ఐ లింగం తెలిపిన వివరాల ప్రకారం... రోజు మాదిరిగా సిబ్బంది శనివారం రాత్రి పీహెచ్‌సీకి తాళం వేసి వెళ్లారు. వారు తిరిగి ఆదివారం ఉదయం వచ్చి చూడగా పీహెచ్‌సీ మొత్తం చిందరవందరగా ఉన్నది. అనుమానం వచ్చి డాక్టర్‌కు సమాచారమివ్వగా, ఆయన వచ్చి పరిశీలించి పీహెచ్‌సీలోని మూడు ఇన్వర్టర్‌కు చెందిన మూడు బ్యాటరీలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

దేవీ నమో... శైలపుత్రీ నమో..

● నేటి నుంచి దేవీ శరన్నవరాత్రోత్సవాలు ● ముస్తాబైన ఆలయాలు, మండపాలు



చేర్యాల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): అమ్మలగన్నయమ్మ... ముగ్గురమ్మల మూలపుటమ్మ... దుర్గా దేవి. శక్తి స్వరూపిణి, లయకారిణిగా కీర్తింపబడుతున్న దుర్గాదేవి నవరాత్రులు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. సకల శుభాలు, విజయాలను చేకూర్చే విజయదశమిని పురస్కరించుకుని నిర్వహించే ఉత్సవాలలో తొమ్మిది రోజులపాటు అమ్మవారు తొమ్మిది అవతారాలలో భక్తులు కొలవనున్నారు. ఏటా ఆశ్వయుజ శుద్ధ పాడ్యమినుంచి శుద్ధ నవమి వరకు నవరాత్రులు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. అమ్మవారి ఆరాధనా మహోత్సవాన్ని దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలుగా పిలుస్తారు.

తొమ్మిది అవతారాలు...

దస్ అంటే పది, హరా అనగా పండుగ అని అర్థం. విజయానికి నాంది అయిన విజయదశమిని పురస్కరించుకుని దుర్గాదేవిని ఆరాధిస్తే సకల శుభాలు, విజయప్రాప్తి లభిస్తుందని భక్తుల నమ్మకం. ఇందుకు ఎందరో దేవతలు, రాజులు సాధించిన విజయాలే నిదర్శనమని పెద్దలు చెబుతుంటారు. . రాక్షస సంహార క్రమంలో దుర్గాదేవి ధరించిన రూపాలకు ప్రతిగా రోజుకో అలంకారం చొప్పున ప్రత్యేక పూజలు జరుపుతారు.

శైలపుత్రి (మొదటిరోజు): పార్వతి రాజపుత్రిక. నవదుర్గ అలంకరణలో మొట్టమొదటి అమ్మవారు పార్వతీదేవి స్వరూపం. అమ్మవారిని పూజించడం వలన స్థిరమైన బుద్ధి, మంచి ఆలోచనలు కలుగుతాయి. ఇష్టమైన రంగు.. నీలం. నైవేద్యం పొంగలి.

బ్రహ్మచారిణి (రెండవరోజు): బ్రహ్మ స్వరూపిణి అవతారంలో అమ్మవారు తెలుపు రంగు వస్త్రాలు ధరించి బ్రహ్మ మండలమును చేతపట్టుకుని సాక్షాత్తు బ్రహ్మ యొక్క బుద్ధిలోని దేవతగా ఆరాధింపబడుతుంది. అమ్మవారి ఆరాధనతో సకల విద్యలు సమకూరుతాయి. పసుపు రంగు. నైవేద్యం పులిహోర.

చంద్రఘంటాదేవి (మూడవరోజు): ఈ అవతారంలో అమ్మవారు ఘంటా నాదంతో రాక్షసులను దగ్గరకు రాకుండా చేస్తుంది. అమ్మవారి ఆరాధనతో రాక్షస బాధలు తొలగుతాయి. లేత ఎరుపు రంగు- కొబ్బరి అన్నం.

కూష్మాండదేవి (నాలుగోరోజు): కూష్మాండం అనగా గుమ్మడికాయ. సృష్టిలో ప్రతీ ఆకు, మొక్క, చెట్టును ఆరాధనీయంగా కొలుస్తారు. ఆకాశం రంగు, అల్లం గారెలు ప్రీతికరం.

స్కందమాత దేవి (ఐదవరోజు): స్కందమాత అనగా కుమారస్వామి తల్లి. ఆరు శిరస్సుల కుమారస్వామికి శక్తి తల్లిగా అవతరించి సృష్టిలో తన కుమారుడిని ఎవరూ ఎదురించలేరని శక్తివంతుడిగా తయారు చేస్తుంది. అందుకే ఆరాధన క్రమంలో కుమారస్వామి ఆరాధన ప్రథమం. కనకాంబరం, పెరుగు అన్నం ప్రీతి.

కాత్యాయనీ దేవి (ఆరవరోజు): పెళ్లికాని అమ్మాయిలు అమ్మవారిని ఆరాధిస్తే శివుడంతటి మంచి భర్త లభిస్తాడని ప్రతీతి. ముదురు ఎరుపు రంగు, రవ్వ కేసరి ప్రీతి.

కాళరాత్రి దేవి (ఏడవరోజు): కాళరాత్రి దేవి తాంత్రిక ఉపాసకులకు ఇష్టదైవంగా కొలుస్తారు. అమ్మవారికి తెలుపు రంగు, కదంబం, అన్ని రకాల కూరలతో కలిపి చేసిన అన్నం అంటే ప్రీతి.

మహా గౌరి (ఎనిమిదవరోజు): మహిళలు, ముత్తయిదువలు సౌభాగ్యం, సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని పూజిస్తారు. ఎర్రటి ఎరుపు రంగు, మినప గారెలు ప్రీతి.

సిద్ధిదాత్రిదేవి (తొమ్మిదోరోజు): అమ్మవారి అవతారాలలో చివరిగా సిద్ధిదాత్రి దేవిగా పూజిస్తారు. మనో శ్రేయస్సు కలగాలని వేడుకుంటారు. అమ్మవారి ఆరాధన ద్వారా సకల వరాలు సిద్ధిస్తాయి. ఈ మేరకు అమ్మవారిని కీర్తించి విజయదశమి రోజున అన్ని విజయాలు, శుభాలు కలగాలని వేడుకుంటూ నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనుండటంతో ఆధ్యాత్మికత ఉట్టిపడనుంది.

చండీ క్షేత్రం.. ఉత్సవాలకు సిద్ధం

జోగిపేట/ చిలిప్‌చెడ్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జోగిపేటకు అతి సమీపంలో మంజీరానది ఒడ్డున వెలసిన చాముండీశ్వరీ దేవాలయం నవరాత్రోత్సవాలకు ముస్తాబైంది. చాముండీశ్వరీ దేవికి సోమవారం నుంచి అక్టోబరు 1వ తేదీవరకు ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించనున్నట్టు శ్రీచాముండీశ్వరీ సేవా సమితి శాక్త మండల్ తెలిపింది. అమ్మవారు ప్రతిష్ఠితమైన కొద్ది కాలంలోనే ప్రసిద్ధిగాంచి భక్తులు కోరిన కోరికలు తీరుస్తూ నిత్యకల్యాణం, పచ్చతోరణంగా విలసిల్లుతోంది. మంజీరా నదికి తూర్పు ఒడ్డున సుమారు 50 ఎకరాల సువిశాల ఆవరణలో ఈ క్షేత్రం నిర్మితమైంది. దాదాపుగా అన్ని దేవాలయాల్లోనూ విగ్రహాలు మామూలు ఎత్తులో ఉండడం సర్వసాధారణం. కానీ ఇక్కడ అమ్మవారి విగ్రహం ఎత్తు తొమ్మిది అడుగులు కావడం విశేషం. జ్వాలా కిరీటంతో 18 చేతులతో పద్మంపై నిల్చున్న విధంగా అమ్మవారి విగ్రహాన్ని తమిళ శిల్పులచే చెక్కించారు. ఈ విగ్రహానికి ఉపయోగించిన శిలను కరీంనగర్ జిల్లా ధర్మపురి ప్రాంతంలోని కొండల నుంచి సేకరించారు. ఇక్కడ ప్రతిష్ఠించిన చాముండీశ్వరి ఖడ్గహస్తసాయుధయై దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ చేస్తూ ప్రసన్నంగా దర్శనమిస్తుంది. దీనికి ఎదురుగా 20 అడుగుల దూరంలో బ్రాహ్మి, కాళీ, వారాహి విగ్రహాలను కూడా ప్రతిష్ఠించారు.



శ్రీచాముండీశ్వరీ మూల విరాట్టు

క్షేత్ర విశిష్టతలు

ఈ క్షేత్రంలో నదిలో మునిగి తడి బట్టలతో గుడికి వచ్చి ప్రదక్షిణలు చేయడం, ముడుపులు కట్టడం ద్వారా తమ కోరికలు నెరవేరుతాయని భక్తులకు ప్రగాఢ విశ్వాసం. జాతి, కుల వివక్షను పాటించకపోవడం ఇక్కడి ప్రత్యేకత. సాధారణంగా ఏ ఆలయంలోనైనా గర్భగుడిలోకి భక్తుల ప్రవేశం నిషిద్ధం. కానీ, ఇక్కడ కుంకుమార్చన చేయదలచుకున్న భక్తులు ఎవరైనా నేరుగా గర్భగుడిలోకి ప్రవేశించి సాక్షాత్తూ అమ్మవారి పాదాలపైనే పూజ జరుపుకోవడం విశేషం. నీటిలో మునిగి, తల తుడుచుకోకుండా, తడిబట్టలు విడువకుండా వచ్చిన వారు అమ్మవారి పాదాలను తాకవచ్చన్న సంప్రదాయం ఇక్కడ విలక్షణంగా కనబడుతుంది.

విగ్రహ ప్రతిష్ఠాపన

అయ్యగారుగా తమ శిష్యులందరికీ ప్రీతిపాత్రులు, ఆదర్శప్రాయులుగా నిలిచిన అయిలావఝుల వెంకటరమణయ్య ఈ ఆలయాన్ని స్థాపించారు. 1982 సంవత్సరంలో విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అంతకు ముందు 5 సంవత్సరాల క్రితమే ఈ ఆలయానికి శంకుస్థాపన జరిగింది. కాగా, ఎన్నో సంవత్సరాలు పూజలందుకుని, ఎన్నో లక్షల మందికి అన్నదానాన్ని జరిపించిన శ్రీచక్రంను చాముండీశ్వరీ విగ్రహానికి యంత్రంగా శంకుస్థాపనలో ఉంచారు. మంత్రతంత్రాలు, పూజా పునస్కారాలతో పాటు అన్నదానానికి కూడా విశేష ప్రాధాన్యముంటుంది. దూర ప్రాంతాలనుంచి దర్శనార్థమై వచ్చేవారికి ఇక్కడ ఉచిత భోజన వసతి లభిస్తుంది. ఇందుకు కావలసిన సరుకులను ఆలయ సేవాసమితే సమకూర్చుకోవడం విశేషం.



చాముండీశ్వరీ ఆలయం



ఏడుపాయలలో ముస్తాబైన గోకుల్ షెడ్

మర్పడగ క్షేత్రంలో..

కొండపాక/మెదక్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కోరిన కోరికలు తీర్చే తెలంగాణలోనే ప్రసిద్ధి పొందిన మర్పడగ విజయ దుర్గ సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో శరన్నవరాత్రి ఉత్సవాలు జరగనున్నాయి. తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతాయని నిర్వాహకులు, దేవీ ఉపాసకులు డాక్టర్ చెప్పెల హరినాథ శర్మ తెలిపారు. మొదటి రోజు కలశ స్థాపన, దీక్షాధారణ కార్యక్రమాలతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని తెలిపారు. 28న లక్ష పుష్పార్చన, 29న మూల నక్షత్ర విశేష పూజలు, విద్యార్థులచే దుర్గా సరస్వతి పూజ, అక్టోబరు 2న విజయదుర్గా దేవి విజయ దర్శనం, శమీ పూజ కార్యక్రమాలు జరుగుతాయి.

ఏడుపాయల్లో..

ఏడుపాయల్లో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఉత్సవాల కోసం గోకుల్ షెడ్డును ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. మొదటి రోజు అమ్మవారు శ్రీ బాల త్రిపుర సుందరీ దేవి (శైల పుత్రి) అలంకారంతో ముదురు పసుపు రంగు వస్త్రాల అలంకరణలో భక్తులకు దర్శనం ఇవ్వనుంది. ఈ ఉత్సవాలకు మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ హాజరవుతారని ఈవో చంద్రశేఖర్ తెలిపారు. ఒక రోజు పూజ కార్యక్రమంలో పాల్గొనే దంపతులు రూ.251 చెల్లించాలని, నవరాత్రులలో ప్రతి రోజు గోత్ర నామార్చన చేయించాలనుకునే వారు రూ.1,116 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ప్రతిరోజు వనదుర్గ అన్నదాన సేవా సమితి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుందని చెప్పారు.

అదే విధంగా జహీరాబాద్, వెల్దుర్తి మనూరు, తూప్రాన్, సంగారెడ్డి , నారాయణఖేడ్, రాయికోడ్, చిన్నశంకరంపేట చేర్యాల పట్టణంతోపాటు పలు మండలకేంద్రాలు, గ్రామాలలో ప్రత్యేకంగా మండపాలు ఏర్పాటు చేశారు. ఆలయాలను అందంగా ముస్తాబు చేశారు. దుర్గాదేవి నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని భక్తులు నేడు భవాని దీక్షలు చేపట్టనున్నారు.



తూప్రాన్‌లో ముస్తాబైన మండపం



మర్పడగ క్షేత్రంలో విజయ దుర్గామాత

ముస్తాబైన వర్గల్ విద్యాధరి క్షేత్రం

వర్గల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రెండో బాసరగా పేరొందిన వర్గల్ శంభుగిరి కొండపై వెలసిన విద్యాధరి క్షేత్రంలో ఈ నెల 22 నుంచి విద్యా సరస్వతీ అమ్మవారి శరన్నవరాత్రి మహోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ వేడుకలకు ఆలయం ముస్తాబైంది. అక్టోబరు 2వ తేదీ గురువారం విజయదశమి (దసరా)తో ఉత్సవాలు ముగియనున్నాయి. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు 40 కి.మీ దూరంలో హైదరాబాద్-కరీంనగర్‌కు వెళ్లే మార్గంలోని రాజీవ్ రహదారి పక్కన 5 కి.మీ దూరంలో వర్గల్ విద్యాధరి క్షేత్రం ఉంది.



1989లో అంకురార్పణ..

జ్యోతిర్వేత్త, పంచాంగకర్త ఏకే శ్రీనివాసచార్యుల సంకల్పం, అతని శిష్యులైన యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి కృషి ఫలితంగా వర్గల్‌లో విద్యాధరి క్షేత్రం ఏర్పడింది. శంభుగిరి కొండపై దేవతలు సంచరించే స్థలంగా పేరొందిన సప్తస్వరాల గుండు పక్కన 1989 లో వసంత పంచమి రోజున ఆలయ నిర్మాణానికి అంకురార్పణ జరిగింది. భక్తుల సహకారం, సత్యపథం సేవా సమితిగా ఏర్పడి పురాతన ప్రాశస్త్యం కలిగిన స్వయంభు శంభులింగేశ్వర ఆలయం పక్కన విద్యా సరస్వతీ ఆలయం సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకుంది. 1992లో శంభుగిరి కొండపై విద్యా సరస్వతీ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ జరిగింది. అదే సంవత్సరంలో కొండపైన శనైశ్వరాలయం నిర్మితమైంది. 2001లో లక్ష్మీగణపతి ఆలయం రూపుదిద్దుకుంది. నాలుగు ఆలయాల సంగమం కావడంతో నాటి నుంచి విద్యాధరి క్షేత్రమైనది.

శరన్నవరాత్రుల వివరాలు..

విద్యా సరస్వతీ అమ్మవారి ఆలయంలో ఈ నెల 22 నుంచి అక్టోబరు 2 గురువారం వరకు ఉత్సవాలు కొనసాగుతాయి. ఈ నెల 29 రోజున మూల నక్షత్రం సందర్భంగా పుస్తక రూపిణి సరస్వతి పూజ, పుష్పార్చన, అక్షర స్వీకారాలతో పాటు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. అక్టోబరు 1న మహర్నవమి విద్యా సరస్వతీ అమ్మవారికి అష్టోత్తర శత కలశాభిషేకం, మహా పూర్ణాహుతి, హోమ బలి దానము నిర్వహిస్తాం. అక్టోబరు 2 విజయదశమి రోజున ఉదయం 5 గంటలకు త్రిశక్తి స్వరూపిణి శ్రీవిద్యాసరస్వతీ అమ్మవారికి విశేషాభిషేకం, హారతి, మంత్రపుష్పం, తీర్థ ప్రసాదముల వితరణ. అనంతరం ఇచ్ఛాశక్తి, జ్ఞానశక్తి, క్రియాశక్తి స్వరూపిణియైన విద్యా సరస్వతీ అమ్మవారి విజయ దివ్య దర్శనం, శమీ పూజ ఉంటాయి. శరన్నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని భక్తులకు అన్నీ ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ వ్యవస్థాపక చైర్మన్ యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి తెలిపారు. తొమ్మిది రోజులపాటు వేడుకలకు వేలాది మంది భక్తులు తరలిరానున్నారని, ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తామని, నవరాత్రోత్సవాలలో అమ్మవారు రోజుకో ప్రత్యేక రూపంలో దర్శనమివ్వడం జరుగుతుందన్నారు. వేడుకల దృష్ట్యా ఆలయ ప్రాంగణంలో సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు భజన, భక్తి పాటలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

మంత్రులకు ఆహ్వానం

వర్గల్ విద్యాధరి క్షేత్రంలో నిర్వహించే మహోత్సవాలకు రాష్ట్ర మంత్రులు గడ్డం వివేక్ వెంకటస్వామి, తుమ్మల నాగేశ్వరరావులను ఆహ్వానించారు. ఈ మేరకు ఆదివారం ఆలయ కమిటీ సభ్యులు హైదరాబాద్‌లోని మంత్రి కార్యాలయంలో ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రులకు సరస్వతీ అమ్మవారి శేష వస్త్రాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నూక భిక్షపతి, వంటిమామిడి మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ మోహన్, వైస్ చైర్మన్ ప్రభాకర్ గుప్తా తదితరులు ఉన్నారు.

సిద్దిపేట జిల్లా అధికారులకు ప్రశంసలు





ప్రశంసాపత్రాలు అందుకుంటున్న తొగుట సీఐ లతీఫ్, మల్లన్నసాగర్ డీఈ శ్రీనివాస్ రావు

తొగుట, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో గ్రామ స్థాయిలో ప్రజలతో మమేకమై వివిధ రంగాలలో సేవలందించిన జిల్లాలోని ఇద్దరు అధికారులు ఆదివారం హైదరాబాద్‌లో తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందుకున్నారు. సంవత్సరం పైగా ధీటీ జిల్లాల్లో ప్రజలతో ఆశా గీతాంజలి వేదిక ద్వారా శీఘౌరా కిలోమీటర్ల మేర ప్రయాణం చేసిన రంజీ క్రికెటర్ నాగేంద్ర నేరుగా సంప్రదించి, గుర్తించి అధికారులను ఎంపిక చేశారు. దాంతో తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ చేతుల మీదుగా సిద్దిపేట జిల్లా నీటిపారుదల శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చెన్ను శ్రీనివాస్ రావు, తొగుట సీ.ఐ. లతీఫ్‌లకు ప్రశంసా పత్రాలు అందజేసి ఘనంగా సత్కరించారు.

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా నర్సింహులు

తొగుట, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తొగుట మండలం చందాపూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ బొడ్డు నర్సింహులు యాదవ్ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తనపై నమ్మకంతో ఈ పదవి అప్పగించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.



నర్సింహులుకు నియామక పత్రం అందజేస్తున్న జాతీయ అధ్యక్షుడు కృష్ణయ్య

రేపటి నుంచి కల్యాణ వేంకటేశ్వరుడి బ్రహ్మోత్సవాలు

● ఆరు రోజులపాటు వేడుకలు
● 26 న స్వామి వారి కల్యాణం
● ముస్తాబైన ఆలయం

గుమ్మడిదల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : కోరిన వరాలు ఇచ్చే కొంగుబంగారంగా పేరుగాంచిన గుమ్మడిదల శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 23 నుంచి 28 వరకు జరుగనున్నాయి. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.





గుమ్మడిదలలోని కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం, కొలువుదీరిన స్వామివారు

ఆరు రోజుల ఆధ్యాత్మిక వైభవం

ఈ నెల 23న స్వస్తివాచనం, బ్రహ్మోత్సవ ఆరంభ కార్యక్రమంతో వేడుకలు మొదలవుతాయి. 24న ధ్వజారోహణం, సాయంత్రం శేషవాహన సేవ, 25న అభిషేకం, గజవాహన సేవ, 26న కల్యాణ మహోత్సవం, హనుమంత వాహన సేవ, 27న సదస్యం, గరుడ వాహన సేవ, 28న మహా పూర్ణాహుతి, అశ్వవాహన సేవలు వైభవంగా జరగనున్నాయి. ప్రతి రోజు జరిగే వాహన సేవలు భక్తులను ఆకట్టుకోనున్నాయి. ముఖ్యంగా కల్యాణోత్సవం రోజున స్వామి వారి వివాహ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. హైదరాబాద్‌కు సమీపంలో ఉండటం వల్ల ప్రతి ఏటా పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వస్తారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పాలకవర్గం, వంశపారంపర్య ధర్మకర్తలు, గ్రామ పెద్దలతో కలిసి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు దేవాలయ కమిటీ చైర్మన్ మద్దుల బాల్ రెడ్డి తెలిపారు.

ఆలయాల్లో అమావాస్య సందడి

● ఆలయాలకు పోటెత్తిన భక్తులు

ఝరాసంగం/గుమ్మడిదల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన ఝరాసంగంలోని శ్రీకేతకీ సంగమేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం అమావాస్య సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కర్ణాటక, మహారాష్ట్రలతో పాటు జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. ఉదయం అమృత గుండంలో స్నానాలు ఆచరించి స్వామి వారి దర్శనం కోసం క్యూలో బారులు తీరారు. మండల పరిధిలోని మాచనూర్ గ్రామ శివారులో ఉన్న రామేశ్వర స్వామి ఆలయానికి కూడా భక్తులు తరలి వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమాలను చేపట్టారు.



ఝరాసంగం : కేతకిలో స్వామి వారి దర్శనం కోసం క్యూలో బారులు తీరిన భక్తులు

రుద్ర హోమం

గుమ్మడిదల మండలంలోని బొంతపల్లి వీరన్నగూడెం గ్రామంలోని శ్రీ వీరభద్ర స్వామి ఆలయంలో రుద్ర హోమం వైభవంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో, పర్యవేక్షకుడు సోమయ్య సమన్వయంతో, అర్చకులు వైదిక పద్ధతిలో హోమాన్ని నిర్వహించగా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదానం ఏర్పాటు చేశారు.

చెరువులో పడి పారిశుధ్య కార్మికుడి మృతి

చిన్నశంకరంపేట, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందంపేట గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికుడు ప్రమాదవశాత్తు చెరువులో మునిగి మృతి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రుద్రారం గ్రామానికి చెందిన పుల్లగల రాజు (24) బాల్యం లోనే తల్లిదండ్రులను కోల్పోయి అనాథగా మారాడు. తల్లిదండ్రులు కోల్పోవడంతో తన అమ్మమ్మ నర్సవ్వ చెంతకు చేర్చుకొని పెంచి పెద్ద చేసింది. చందంపేట గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికుడిగా పని చేస్తున్నాడు. పారిశుధ్య పనులు ముగించుకొని స్నానం చేసేందుకు చందంపేట పెద్ద చెరువులోకి ఈత కొడుతున్న క్రమంలో ప్రమాదవశాత్తూ నీటిలో మునిగి మృతి చెందాడు. దీంతో గ్రామంలో విషాదం నెలకొంది. విషాద ఘటన సమాచారం అందుకున్న పోలీసులు శవ పంచనామా నిర్వహించి, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నారాయణగౌడ్ తెలిపారు.



రాజు (ఫైల్)

రిజర్వేషన్ల హడావిడి

(5వ పేజీ తరువాయి)

ఎన్నికల్లోనూ ఇదే జనాభాతో రిజర్వేషన్లు అమలు చేశారు. ఈసారి కొత్తగా బీసీ జనాభాను లెక్కించడంతో రిజర్వేషన్లు మారే అవకాశం ఉంది. ఈ విషయంపై వివాదం నడుస్తున్నందున సర్కారు ఆలోచన, అధికారుల ప్రయత్నాలు ఎంతవరకు ముందుకెళ్తాయో వేచిచూడాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ జనాభా తేలితే ఇతర సామాజిక వర్గాల రిజర్వేషన్లపై ఒక అంచనా ఏర్పడుతుంది. అందుకే ఈ మూడు సామాజిక వర్గాలపైనే ఫోకస్ పెట్టారు. ఈనెల 24వ తేదీ వరకు పూర్తి నివేదికను మూడు జిల్లాల నుంచి ప్రభుత్వానికి పంపించాలంటూ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు.

నోటిఫికేషన్‌పై ఉత్కంఠ

దాదాపు 20 నెలలుగా స్థానిక, పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లపై తర్జనభర్జన పడుతూనే ఉన్నారు. అందుకే 2024 ఫిబ్రవరిలో జరగాల్సిన పంచాయతీ ఎన్నికలు, మే నెలలో పూర్తికావాల్సిన ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు వాయిదా పడ్డాయి. కాగా ప్రస్తుత సెప్టెంబరు నెలాఖరు వరకు ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు సూచించింది. ఈ గడువుకు మరో 8 రోజులు మాత్రమే మిగిలి ఉన్నందున ప్రభుత్వం రిజర్వేషన్ల ప్రక్రియను ముగించాలని చూస్తున్నట్లుగా తెలుస్తోంది. ఎన్నికలు నిర్వహించకున్నా ఆ దిశగా అడుగులైతే పడ్డాయనే కోణంలో ప్రభుత్వం కౌంటరు దాఖలు చేస్తుందా.. లేక ఈనెలాఖరు వరకే నోటిఫికేషన్ విడుదల చేసి అక్టోబరులో ఎన్నికలు నిర్వహిస్తుందా అనే విషయంపై ఉత్కంఠ నెలకొంది. ఆదివారం సెలవు దినమైనా వీడియోకాన్ఫరెన్సు నిర్వహించి మండల, గ్రామస్థాయి అధికారులకు ఆదేశాలు ఇచ్చారని తెలియగానే ఆశావహుల్లో ఆసక్తి రేకెత్తుతోంది.



చేర్యాల పట్టణంలోని శ్రీనగర్ కాలనీ, కేపీఆర్ కాలనీలలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


తొగుట మండలం వెంకట్రావ్‌పేటలో...

తొలిరోజు ఎంగిలిపూల బతుకమ్మ సందడి

జిల్లా వ్యాప్తంగా బతుకమ్మ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం అమావాస్య సందర్భంగా ఎంగిలిపూల బతుకమ్మతో వాడవాడలా సంబురాలు జరుపుకున్నారు. తీరొక్కపూలతో బతుకమ్మలను అందంగా పేర్చి సాయంత్రం వేళలో ఆయా గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో బతుకమ్మలను ఉంచి మహిళలు, యువతులు, చిన్నారులు ఉత్సాహంగా బతుకమ్మ పాటలతో సందడి చేశారు. అనంతరం వాటిని సమీపంలోని చెరువుల్లో నిమజ్జనం చేసి ఫలహారాలను పరస్పరం పంచుకున్నారు.

- న్యూస్‌నెట్‌వర్క్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి)


సిద్దిపేటలోని టెలికాంనగర్‌లో మహిళల బతుకమ్మ సంబరాలు


సిద్దిపేటలో కోమటి చెరువు వద్ద బతుకమ్మల నిమజ్జనం


మద్దూరు మండలకేంద్రంలో..


రాయపోల్ మండలం పెద్దారెపల్లిలో..


చిన్నకోడూరు: చంద్లాపూర్‌లో బతుకమ్మలతో మహిళలు

న్యూస్ బాక్స్

పేద విద్యార్థికి ఎంబీబీఎస్‌లో ఫ్రీ సీటు


ఇలిటం సుశాంత్

మద్దూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లద్నూరు గ్రామానికి చెందిన పేద విద్యార్థి ఇలిటం సుశాంత్ ఎంబీబీఎస్‌లో ఫ్రీ సీటు సాధించి గ్రామస్థుల మన్ననలు పొందాడు. లక్ష్యాన్ని సాధించేందుకు పేదరికం అడ్డు కాదని నిరూపించాడు. నీట్ 2025 ఎంట్రెన్స్ ఎగ్జామ్‌లో ఉత్తీర్ణత సాధించి సికింద్రాబాద్ గాంధీ ప్రభుత్వ వైద్య కళాశాలలో ఫ్రీ సీటు సాధించడం పట్ల కుటుంబ సభ్యులతో పాటు స్నేహితులు ఆదివారం అతడిని అభినందించారు.

సెలవుల్లో పాఠశాలలు నిర్వహిస్తే దాడులు చేస్తాం: ఏఐఎస్ఎఫ్

చేర్యాల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : దసరా సెలవులు పాటించకుండా ప్రైవేటు పాఠశాలలు అత్యుత్సాహంతో తరగతులు నిర్వహిస్తే దాడులు చేస్తామని ఏఐఎస్ఎఫ్ చేర్యాల మండల కార్యదర్శి ఎస్కే యాసీన్ హెచ్చరించారు. ఆదివారం చేర్యాలలో జరిగిన యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రత్యేక తరగతుల పేరుతో విద్యార్థులను పాఠశాలకు రప్పించేందుకు పలు పాఠశాలలు ప్రయత్నిస్తున్నాయని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే సహించబోమన్నారు. ఈ విషయమై విద్యాశాఖ ఉన్నతాధికారులు ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలకు తగు సూచనలు చేయాలని తెలిపారు. సమావేశంలో నాయకులు పోతుగంటి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

శివ్వంపేట, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మహిళల ఆర్థికాభివృద్ధే హోప్ ఫర్ లైఫ్ ఫౌండేషన్ ప్రత్యేక లక్ష్యమని చైర్మన్ డాక్టర్ హిమజ అన్నారు. మెదక్ జిల్లా శివ్వంపేట మండల పరిధిలోని మగ్దంపూర్ బేతాని సంరక్షణ అనాధ ఆశ్రమంలో ఆదివారం 20 మంది హెచ్ఐవీ బాధితురాళ్లకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. హెచ్ఐవీ బాధితులకు టైలరింగ్, జూట్ బ్యాగ్ మేకింగ్‌పై మూడునెలలు ఉచిత శిక్షణ ఇచ్చి, స్వయం ఉపాధి కల్పించేందుకు కుట్టుమిషన్లు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో ఫాదర్ సెబాస్టియన్,ఆశ్రమ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మహాలయ అమావాస్య


అక్బర్‌పేట-భూంపల్లి మండలం కూడవెల్లి రామలింగేశ్వరాలయంలో పురోహితుడికి స్వయం పాకం అందజేస్తున్న వృద్ధుడు


సిద్దిపేటలో ఆర్యవైశ్య భవన్ వద్ద అన్నదానం

సిద్దిపేట కల్చరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మహాలయ అమావాస్య సందర్భంగా సిద్దిపేట పట్టణంలో పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ఆదివారం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలోని ఆర్యవైశ్య భవన్‌లో వాసవిమాత మిత్ర మండలి ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ చేశారు. ప్రతీ అమావాస్య రోజు అన్నదానం నిర్వహిస్తున్నట్లు వాసవీమాత మిత్ర మండలి ప్రతినిధులు తెలిపారు. పట్టణంలోని మోడ్రన్ బస్టాండ్ వద్ద శ్రీపర్వతవర్ధిని రామలింగేశ్వర సేవాసమితి ఆధ్వర్యములో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఏడాది కాలంగా ప్రతీ అమావాస్యకు అన్నదానం చేస్తున్నట్లు చెప్పారు.

● **దుబ్బాక:** మండలంలో శనివారం పితృ అమావాస్యను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లో తమ పెద్దల పేరిట ప్రజలు పురోహితులకు స్వయంపాకం దానం చేశారు. దుబ్బాక పట్టణంలో ఉమామహేశ్వరాలయంతోపాటు పలు ఆలయాల్లో పురోహితులు పితృదేవతల పేరిట ప్రజల నుంచి స్వయం పాకం దానాలను స్వీకరించి ప్రత్యేక పూజలతో ఆశీర్వచనాలు అందజేశారు. అక్బర్‌పేట- భూంపల్లి మండలం రామేశ్వరంపల్లి కూడవెల్లి రామలింగేశ్వ రాలయం. చౌదర్‌పల్లి దుబ్బ రాజేశ్వరాలయంలో కూడా స్వయంపాకం దానం చేశారు. కూడవెల్లివాగులో తర్పణాలు వదిలారు.

తలో చేయి వేశారు.. రోడ్డు బాగు చేసుకున్నారు


కేపీఆర్ కాలనీలో దారి మరమ్మతులు చేయిస్తున్న వెల్ఫేర్ కమిటీ ప్రతినిధులు

చేర్యాల, సెప్టెంబరు 21 (ఆంధ్ర జ్యోతి) : చేర్యాల మునిసిపల్ పరిధిలోని కేపీఆర్ నగర్ కాలనీలో పలువురు చేయిచేయి కలిపి మరమ్మతులు చేపట్టి దారిని బాగుచేసుకున్నారు. కాలనీలో కొద్దిరోజుల క్రితం తాగునీటి సరఫరా పైప్‌లైన్ పనులు చేపట్టారు. గోతుల తవ్వకంతో పాటు వర్షాలకు దెబ్బతిని దారి మొత్తం గుంతలమయమైంది. రోడ్డును బాగు చేయాలని స్థానికులు మునిసిపల్ అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకువెళ్లినా పట్టించుకోలేదు. దీంతో కేపీఆర్ కాలనీ వెల్ఫేర్ కమిటీ అధ్యక్షుడు ఆరెల్ల వీరమల్లయ్య, కార్యదర్శి గందె వేణు, ఉపాధ్యక్షుడు కడ్డూరి మహేందర్, కోశాధికారి మలిపెద్ది రామకృష్ణ తదితరులు సభ్యులతో చర్చించి తలా కొంచెం డబ్బు వేసుకుని టిప్పర్లతో మట్టి, మొరం పోయించారు. చదును చేయించి మరమ్మతులు చేసుకున్నారు. మునిసిపల్ అధికారులు స్పందించి శాశ్వత రోడ్డు పనులు చేపట్టాలని కోరారు.

అంగడికి వచ్చి గుండెపోటుతో మృతి


మృతి చెందిన పొట్టేళ్ల పెంటయ్య

దౌల్తాబాద్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో ఆదివారం మధ్యాహ్నం అంగడికి వచ్చిన వృద్ధుడు గుండెపోటుతో మృతి చెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని తిమ్మకపల్లి గ్రామానికి చెందిన పొట్టేళ్ల పెంటయ్య(70) ఆదివారం మధ్యాహ్నం సుమారు 2.30 గంటలకు ద్విచక్రవాహనంపై దౌల్తాబాద్ మండల కేంద్రానికి అంగడి కోసం వచ్చాడు. అంగడికి చేరుకున్న పెంటయ్య నడుచుకుంటూ వెళ్తుండగా పవిత్ర లేడీస్ ఎంపోరియం వద్ద ఒక్కసారిగా కుప్పకూలాడు. వెంటనే ఆ షాపు యజమాని అతడివద్దకు వచ్చి లేపి మాట్లాడుతుండగనే మళ్లీ గుండెపోటుతో పెంటయ్య కుప్పకూలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి పిల్లలు లేరు. భార్య నరసవ్వ అనారోగ్యంతో బాధపడుతున్నట్టు తెలిపారు.

ఆరుగురు జూదరుల అరెస్టు

దౌల్తాబాద్, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవిందపూర్ గ్రామంలో చిత్తుబొత్తు ఆడుతున్న పలువురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఆదివారం సాయంత్రం దౌల్తాబాద్ ఎస్ఐ అరుణ్‌కుమార్ వెల్లడించిన వివరాల మేరకు.. దాదాపు ఆరు నెలలుగా గోవిందాపూర్ లో చిత్తుబొత్తు(జూదం) ఆడుతున్నారని పోలీసులకు సమాచారమందింది. దీంతో ఆదివారం తెల్లవారుజామున పోలీసులు స్థావరంపై దాడి చేసి ఆరుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుల నుంచి రూ.2,935, 5 సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

ఐమాస్ట్ లైట్లు ప్రారంభం


ఐమాస్ట్ లైట్లను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల రాజనర్సు

సిద్దిపేట కల్చరల్, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట పట్టణంలోని 4వ వార్డులో ఐమాస్ట్ విద్యుత్ దీపాలను ప్రారంభించారు. స్థానిక వార్డు కౌన్సిలర్ కొండం కవిత సంపత్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ జంగిటి కనకరాజుతో కలిసి సిద్దిపేట మున్సిపల్ చైర్ పర్సన్ కడవేరుగు మంజుల రాజనర్సు విద్యుత్ దీపాలను ప్రారంభించారు. అనంతరం బతుకమ్మ పండుగ సంబురాల్లో వార్డు మహిళలతో కలిసి చైర్ పర్సన్ మంజుల రాజనర్సు పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ కడవేరుగు రాజనర్సు, కౌన్సిలర్లు ఎడ్ల అరవింద్ రెడ్డి పసకుల సతీష్, బర్ల మల్లికార్జున్, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కురుమ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా రవికాంత్


రవికాంత్‌ను సన్మానిస్తున్న కురుమ ఉద్యోగులు

సిద్దిపేట కలెక్టరేట్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కురుమ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా రవికాంత్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం సిద్దిపేటలో సంఘం ఉద్యోగుల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ మేరకు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రధానకార్యదర్శిగా శ్రీకాంత్, కోశాధికారిగా బండారి మల్లేశం, ఉపాధ్యక్షులుగా రమేష్, బట్ట శ్రీనివాస్, గౌరవ అధ్యక్షులుగా కాంతుల లక్ష్మణ్, రాములును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు రవికాంత్ మాట్లాడుతూ... తన మీద నమ్మకంతో ఏకగ్రీవంగా ఎన్నుకున్న సంఘం సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. సంఘానికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని, పేద విద్యార్థులకు అండగా ఉండడంతో పాటు కులస్థులకు సేవ చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఉద్యోగులు సన్మానించారు.

నిధుల్లేకుండా పండుగల నిర్వహణ ఎలా?

- ప్రజాప్రతినిధులు లేకపోవడంతో పంచాయతీ కార్యదర్శులపై నిర్వహణ భారం
- ప్రభుత్వం నుంచి విడుదల కాని నిధులు
- గ్రామాల్లో సమస్యల తిష్ఠ
- ప్రశ్నార్థకంగా పండుగల ఏర్పాట్లు



మర్రిముచ్చాల గ్రామపంచాయతీ కార్యాలయం, గౌరాయపల్లిలో చిత్తడిగా మారిన రోడ్డు

కొమురవెల్లి,సెప్టెంబర్21(ఆంధ్రజ్యోతి):గ్రామాల్లో ప్రజాప్రతినిధులు లేకపోవడంతో ఈసారి బతుకమ్మ, దసరా పండుగల నిర్వహణ బాధ్యత అంతా పంచాయతీ కార్యదర్శులపైనే పడింది.ప్రభుత్వం బతుకమ్మ, దసరా పండుగల నిర్వహణ కోసం గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడానికి నిధులు విడుదల చేయకపోవడంతో పంచాయతీ కార్యదర్శులు అయోమయంలో పడిపోయారు. ఇప్పటికే గ్రామ పంచాయతీల కార్యాలయాల నిర్వహణకు సొంత నిధులు వెచ్చించామని పంచాయతీ కార్యదర్శులు వాపోతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు గ్రామాల్లో రోడ్లపై గుంతలు ఏర్పడి బురదమయంగా మారాయి వాటిలో మొరం పోయించాల్సి ఉంది. పండుగల సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు ఆయా గ్రామస్తులు వినతి పత్రాలు ఇస్తున్నారు. అయితే నిధుల లేమితో ఈ పనులన్నీ ఎలా చేయాలంటూ పంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గ్రామాల్లో ఎక్కడి సమస్యలు అక్కడే...

గ్రామాల్లో ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లు గుంతలమయంగా మారడంతో పాటు బురదమయంగా తయారయ్యాయి. ప్రధాన చౌరస్తాల్లో, మహిళలు బతుకమ్మ ఆడే ప్రదేశాలను చదును చేయాల్సి ఉంటుంది. ఆయా ప్రాంతాల్లో వీధి లైట్లు వెలగడం లేదు. చెరువు కట్టలపై మొక్కలు పెరిగి బతుకమ్మలు వేయడానికి ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయి. ఇంతేకాకుండా పారిశుధ్యం తదితర అనేక సమస్యలు వేధిస్తున్నాయి. పంచాయతీ కార్యదర్శులు నిధులు లేవంటూ కాలం నెట్టుకొస్తున్నారు.

ప్రభుత్వం నిధులు విడుదల చేయాలి



తెలంగాణలో అతిపెద్ద పండుగలు అయినా బతుకమ్మ, దసరా పండుగల ఏర్పాట్ల కోసం ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడం శోచనీయం. ప్రభుత్వం నిధులు విడుదల చేయకుంటే కేవలం పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో మౌలిక సదుపాయాలు, పండుగ ఏర్పాట్లు ఎలా చేయగలరు.ఇప్పటికైనా ప్రభుత్వం నిధులు విడుదల చేసి పండుగలకు గ్రామాల్లో అన్ని ఏర్పాట్లు చేయాలి.

-సనాది కరుణాకర్,
బీజేవైఎం కొమురవెల్లి మండలాధ్యక్షుడు

ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ బీఆర్ఎస్ ఘనతే


నంగునూరు పార్టీ కార్యాలయంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

నంగునూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ బీఆర్ఎస్ ఘనతేనని, రైతు సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందేమీ లేదని మండల బీఆర్ఎస్ నాయకులు మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎడ్ల సోమిరెడ్డి, రాగుల సారయ్య, సొసైటీ చైర్మన్లు కోల రమేష్‌గౌడ్, మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. నంగునూరు మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు లింగంగౌడ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతుల పట్ల చిన్నచూపు చూస్తుందని ఆరోపించారు. రైతులు పంటలు సాగు చేసుకోవాలంటే ఎరువులు కూడా దొరకని పరిస్థితి నేడు ఏర్పడిందని ఎద్దేవా చేశారు. మండలంలోని నర్మెట ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ కోసం బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో శంకుస్థాపన చేసుకొని నేడు మిషన్స్ ట్రయల్ రన్ విజయవంతం అయిన సందర్భంగా పార్టీ నాయకులు కేసీఆర్, హరీశ్‌రావులకు రైతుల పక్షాన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కాగా ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే చేసినట్లుగా సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వేముల వెంకట్ రెడ్డి, దువ్వల మల్లయ్య, లక్ష్మారెడ్డి, మహేందర్ గౌడ్, ఉల్లి మల్లయ్య, వేణు చక్రవర్తి, సిద్దేశ్వర్ గౌడ్, రాంరెడ్డి, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ లబ్ధి కోసం ఆరోపణలు చేస్తే ఊరుకోం


గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతున్న విజయ్‌వర్ధన్‌రెడ్డి

గజ్వేల్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): రాజకీయ లబ్ధి కోసం ఆరోపణలు చేస్తే ఊరుకోబోమని బీఆర్ఎస్ నాయకులు, బూర్గుపల్లి మాజీ సర్పంచ్ వంటేరు విజయ్‌వర్ధన్‌రెడ్డి హెచ్చరించారు. గజ్వేల్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజ్ఞాపూర్ ఊర చెరువు కాలువల పేరిట తమ కుటుంబాన్ని వివాదంలోకి లాగితే బీజేపీ నేతలపై పరువునష్టం దావా వేస్తామని హెచ్చరించారు. ఊర చెరువు మత్తడి నీటికి ప్రతాప్ రెడ్డి వెంచర్‌కు కిలోమీటర్ దూరం ఉందని, ఎలాంటి సంబంధం లేదన్నారు. బీజేపీ నాయకులకు చిత్తశుద్ధి ఉంటే ఎంపీ రఘునందన్‌రావు నిధుల నుంచి ఊరచెరువు డిశ్చార్జి కల్వర్టు పనులను పునరుద్ధరించి సమస్యను పరిష్కరించాలని సవాల్ విసిరారు. గాడిపల్లి భాస్కర్ హయాంలోనే 216 ప్లాట్లకు చట్టపరంగా అనుమతులు వచ్చాయని, ఆయన చేసిన తప్పులను కప్పి పుచ్చుకొని, రాజకీయ లబ్ధి పొందడం కోసం అవగాహన లేకుండా ఆరోపణలు చేస్తున్నారన్నారు. హైకోర్టు నుంచి తమ వెంచర్‌కు క్లీన్‌చీట్ ఉందన్నారు. సమావేశంలో పార్టీ అధ్యక్షుడు బెండ మధు, నవాజ్‌మీరా, నాయకులు తదితరులున్నారు.

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లను అందించాలి


మాట్లాడుతున్న ఆల్‌ఇండియా ఫార్వర్డ్‌బ్లాక్ పార్టీ మండలాధ్యక్షుడు ఆంజనేయులు

చేర్యాల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లను అందించాలని ఆల్‌ఇండియా ఫార్వర్డ్‌బ్లాక్ పార్టీ చేర్యాల మండలాధ్యక్షుడు పి. ఆంజనేయులు డిమాండ్ చేశారు. చేర్యాల పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి బీఆర్ఎస్ కార్యకర్తలకు, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు ఇందిరమ్మ ఇళ్లను కేటాయించారే తప్ప అర్హులైన పేదలను పట్టించుకోలేదన్నారు. ఎంతోమంది అర్హులైన వారు ఇందిరమ్మ ఇండ్లకోసం ఎదురుచూస్తున్నా పట్టించుకోకపోవడం సబబుకాదన్నారు. ఈవిషయమై పునరాలోచించి పేదలకు ఇండ్లు కేటాయించాలని కోరారు.

కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయసాధనకు కృషి


విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

గజ్వేల్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయసాధనకు కృషి చేస్తామని పద్మశాలీ సంఘం నాయకులు, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్ పేర్కొన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పద్మశాలీ సంఘం నాయకులు దేవులపల్లి రాజారం, తలకొక్కుల దుర్గాప్రసాద్, ప్రేమ్‌కుమార్, రాజేశం, నరేశ్, తుమ్మ శ్రీనివాస్, బలరాం, సత్యనారాయణ తదితరులున్నారు.

విజ్ఞాన వేదిక సిద్దిపేట జిల్లా ప్లీనం


సమావేశమైన జేవీవీ ప్రతినిధులు

సిద్దిపేట కల్చరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జనవిజ్ఞాన వేదిక సిద్దిపేట జిల్లా కమిటీ ప్లీనం ఆదివారం సిద్దిపేటలోని జేవీవీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కమిటీ సభ్యుడు మొలుగు బాలరాజు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మారుతున్న పరిస్థితులకు, సమాజ ధోరణికి, రాజకీయ పరిస్థితులను గమనించి జేవీవీ సైన్స్ ప్రచారం, శాస్త్రీయ వైఖరులు పెంపొందించుటకు కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. జిల్లాలో జేవీవీ సభ్యత్వం రాబోవు రోజుల్లో మరింత పెంపొందించాలని జిల్లా కమిటీకి సూచించారు. జిల్లా అధ్యక్షుడు తుమ్మ సత్యం, జిల్లా ప్రధాన కార్యదర్శి కొమ్ము కనకరాజు మాట్లాడుతూ సమాజంలో చాలామందికి సైన్స్ అంటే ఏమిటో తెలిసినప్పటికీ ,శాస్త్రీయ వైఖరి కొరవడిందని అందువల్లనే అనేక మూఢాచారాలు సమాజంలో కొనసాగుతున్నాయన్నారు. జిల్లాలో జేవీవీ కార్యక్రమాలను ఉధృతంగా చేపట్టి సైన్స్ ప్రచార ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి ఎండి అజీజ్, సైన్స్ ప్రచార రాష్ట్ర కమిటీ సభ్యుడు సాదత్‌అలీ, జేవీవీ సభ్యులు కె మహేందర్, జి ప్రవీణ్, సుధాకర్, జె చంద్రశేఖర్, శ్రీనివాస్, సమీర్ తదితరులు పాల్గొన్నారు.